సాక్షి తిరుపతి

శనివారం । 20 । జనవరి । 2024



‘చేదోడు’తో మెరుగైన జీవనం

జగనన్న తోడుతో మహిళల ఆర్థిక స్థితిగతులు మారి, మెరుగైన జీవనం సాగిస్తున్నారని తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుపతి ఐఐటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. - 8లో



నెరవేరిన దశాబ్దాల కల

తిరుపతిలో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు భవనాలను పరిశీలించారు. - 8లో

న్యూస్‌రీల్

బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట: పట్టణంలో ఈనెల 21న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం పరిశీలించారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద గల పాత బస్టాండ్ సెంటర్, బజారు వీధి, గడియారం సెంటర్, గాంధీమందిరం సర్కిల్, విజయగణపతి టెంపుల్, గోమతి సర్కిల్ వరకు రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. బస్సు యాత్రకు తరలివచ్చే అభిమానులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేపట్టాలని నేతలకు సూచించారు. ఆయన వెంట నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటక్రిష్ణారెడ్డి, గందవల్లి సిద్ధయ్య, చదలవాడ కుమార్, పసల హరిబాబు, కరీంబాయ్ చెంచయ్య, జయరామయ్య, ధారరవి, నాగార్జున, అశోక్ ఉన్నారు.

‘రిజర్వేషన్’లో క్యూఆర్‌కోడ్



రిజర్వేషన్ కౌంటర్ వద్ద క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తూ..

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఇటీవల రిజర్వేషన్ కౌంటర్ వద్ద ప్రయాణికుల తాకిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వారి సౌకర్యార్థం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇన్‌చార్జి ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఓ ప్రయాణికురాలు చేతుల మీదుగా క్యూర్ కోడ్‌ను తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఆర్టీసీ అధికారులు ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ఈడీ మాట్లాడుతూ ప్రయాణికులు చిల్లర సమస్యలతోపాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో క్యూఆర్ కోడ్‌ను తీసుకొచ్చినట్టు తెలిపారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధమవ్వాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వాహణకు అంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన కలెక్టర్లు, జేసీలు, ఈఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తిరుపతి జిల్లా నుంచి జేసీ శుభం భన్సల్‌తోపాటు ఈఆర్‌వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేని పారదర్శక ఎస్ఎస్ఆర్ 2024 తుది జాబితా ప్రచురించాలన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. ఈఆర్‌ఓలు హరిత, కోదండ రామిరెడ్డి, శ్రీనివాసులు, నిషాంత్ రెడ్డి, చంద్రముని, ఎలక్షన్ తహసీల్దార్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

యూరియా అధికమైతే అనర్థమే



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

దక్కిలి (బాలాయపల్లి): వరి పంటకు యూరియా అధికమైతే అనర్థమేనని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో శుక్రవారం ఆత్మపథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరికి యూరియా ఎక్కువ వేయడం వల్ల తెల్లబీద, ముప్ప పురుగు, దోమపోటు, అగ్గితెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు.



కుప్పం.. ప్రగతిపథం

ఇది కదా.. అభివృద్ధి

మూడు రాష్ట్రాల కూడలి కుప్పం.. ప్రతిపక్షనేత ప్రాతినిథ్యం వహించే నియోజకవర్గ కేంద్రం. అయినా మూడు దశాబ్దాలుగా అభివృద్ధి శూన్యం. ఇది నిన్నటి మాట. నేడు కుప్పం స్వరూపం మారిపోయింది. నాడు పాలకుల చిత్తశుద్ధి లేక వెనుకబడిన ఈ పట్టణం నేడు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. నాలుగున్నరేళ్లుగా కుప్పం నయా రూపం సంతరించుకుంటోంది. రైల్వే అండర్ బ్రిడ్జిలు..రోడ్లు.. మురుగునీటి కాలువల నిర్మాణం..ఒకటి కాదు అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతోంది.

- నాడు పంచాయతీ.. నేడు మున్సిపాలిటీ
- ప్రత్యేకంగా రూ.66 కోట్ల నిధులు మంజూరు
- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం
- రెండు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం
- రైల్వే స్థలంలో రోడ్డు సమస్య పరిష్కారం

కుప్పం మున్సిపాలిటీ సమాచారం

- వార్డులు : 25
- ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు : రూ.66 కోట్లు
- మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ రూ. 2 కోట్లు
- మురుగునీటి కాలువల నిర్మాణం : 15 కిలో మీటర్లు
- కాలువల నిర్మాణ వ్యయం : రూ4.5 కోట్లు
- సీసీ రోడ్లు : రూ. 7 కోట్లతో 16 కిలో మీటర్లు
- పైపులైన్లు : రూ. 2 కోట్లతో 16 కిలో మీటర్లు
- నూతనంగా వేసిన బోర్లు : రూ.2 కోట్ల తో 20
- మున్సిపాలిటీ పాలన భవనం : రూ. 5 కోట్లతో ఆధునిక భవనం

కుప్పం: గ్రామ పంచాయతీగా ఉన్న కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. వైఎస్సార్ సీసీ పాలనలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. చంద్రబాబు హయంలో మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ చేయడం వృథా అని అప్పటి టీడీపీ నాయకులు కాలం వెళ్లబుచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్పు చేసి అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది.

రూ.5కోట్లతో మున్సిపల్ భవనం



నాడు

శిథిలావస్థలోని కుప్పం పంచాయతీ భవనం

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తరువాత కుప్పం పంచాయతీ భవనం పరిపాలనకు సరిపోలేదు. దీంతో మున్సిపాలిటీకి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.5 కోట్ల వ్యయంతో రెండు అంతస్తుల నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మున్సిపాలిటీ పాలనకు అనుకూలంగా ప్రతి శాఖకు ప్రత్యేకంగా చాంబర్లు, పాలక వర్గానికి, సమావేశాలకు అనుకూలంగా భవన నిర్మాణం అత్యంత ఆధునికంగా నిర్మిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, కుప్పం మున్సిపాలిటీ పాలనా వ్యవహారాలు నూతన భవనంలోకి మార్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



నేడు

రూ.5 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపాలిటీ భవనం

మున్సిపాలిటీగా రూపాంతరం

రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థ ప్రారంభం నుంచి కుప్పం పంచాయతీగా కొనసాగుతోంది. రోజురోజుకు పట్టణం అభివృద్ధి చెందడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో కమతమూరు, తంబిగానిపల్లె, అనిమిగానిపల్లె, వడ్డిపల్లె, డీకే పల్లె, లక్ష్మీపురం, సామగుట్టపల్లె తదితర గ్రామాలను కుప్పంలో విలీనం చేసి, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని 2014లో అధికారంలోకి వచ్చినా చంద్రబాబుకు అప్పటి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. అయినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జనవరి 2020లో కుప్పం పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ జారీ చేశారు. అప్పటి నుంచి పట్టణం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం

పట్టణంలో 30 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే గేటు సమస్యకు పరిష్కారం లభించింది. గేటు ఉన్న చోట అండర్ బ్రిడ్జి నిర్మించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న గేటు శాశ్వతంగా మూసివేయాలని 1995లో రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. అప్పటి నుంచి 2004 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం దాన్ని గురించి పట్టించుకోలేదు. అనంతరం 2006లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి స్థానిక నేతలు ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన మరణానంతరం రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎంపీ రెడ్డెప్ప రైల్వే బోర్డు సభ్యుడు కావడంతో అండర్ బ్రిడ్జి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. దీంతో పట్టణంలోని రైల్వేగేటు సమస్య పరిష్కారమైంది.

రోడ్డు సమస్య పరిష్కారం

అపరిష్కృతంగా ఉన్న రైల్వే స్థలంలోని కొత్తపేట రోడ్డు సమస్య పరిష్కారం అయ్యింది. ఈ రోడ్డు కొత్తపేట వాసులకే కాకుండా కుప్పం మండలం పడమర, దక్షిణ దిశగా ఉన్న సుమారు 50 గ్రామాల ప్రజలకు రాకపోకలకు అనువుగా ఉంటుంది. గతంలో ఈ రోడ్డు కంకర తేలి, గుంతలమయమైనా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ దృష్టికి స్థానికులు ఈ విషయం తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వారు రోడ్డును పునర్నిర్మించి, సమస్యను పరిష్కరించారు.

రూ.15 లక్షలతో చెరువు కట్టపై ఫెన్సింగ్

పట్టణ ముఖద్వారంలోని కుప్పం చెరువు కట్టపై ఫుట్‌పాత్ వెంబడి నడిచి వెళ్లడానికి పాదచారులు ఇక్కట్లు పడేవారు. ప్రమాదవశాత్తు కాలుజారితే నీటిలో పడే ప్రమాదం ఉండేది. ఈ సమస్యను గుర్తించిన నేతలు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో నేడు ప్రజలు చుట్టూ వాకింగ్ చేస్తున్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



నాడు



నేడు

కుప్పం మున్సిపాలిటీ ఏర్పడిన అనంతరం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కుప్పం పట్టణాన్ని 30 ఏళ్లగా తాగునీటి సమస్య పట్టి పీడిస్తుండేది. 2014–19 వరకు కుప్పం పట్టణంలో నీటి కోసం ప్రజలు నిరంతరం ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారు. అయితే ఆ సమస్యను పరిష్కరించాలని భావించిన వైఎస్సార్ సీపీ నేతలు డీకే పల్లె చెరువు నుంచి పైపులు ద్వారా పట్టణానికి నీటి సరఫరాను నిలిపి వేసి, ప్రతి వార్డులోనూ బోర్లు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చారు. షిఫ్ట్‌ల పద్ధతిలో తాగునీటి సరఫరాకు స్వస్తి పలికి, నిత్యం నేరుగా ఇంటికే నీరు అందిస్తున్నారు.



నేడు

నాడు

నాడు రైల్వే గేటు సమస్య, నేడు నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి



నేడు

నాడు

నాడు గుంతలు, కంకర తేలిన రోడ్డు, నేడు కొత్తగా నిర్మించిన రోడ్డు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



“ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కుప్పం పట్టణాన్ని పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి, రూ.66 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో అపరిష్కృత సమస్యలు కూడా పరిష్కారమయ్యాయి. వసతులు సమకూరుతున్నాయి. సీఎం జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో కుప్పం పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం.

– సుధీర్, ఛైర్మన్, కుప్పం మున్సిపాలిటీ

తాగునీటి సమస్య పరిష్కారం



తపారాజ్ వీధిలో ఎప్పుడూ తాగునీటి సమస్యతో సతమతం అయ్యేవాళ్లం. ఖాళీ బిందెలతో పంచాయతీ ఆఫీసు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపేవాళ్లం. రెండేళ్లుగా తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. ఇప్పుడు ఇంట్లోకే నీరు వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కరించిన జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– సరసమ్మ, కుప్పం

కుప్పం మారుతోంది



మున్సిపాలిటీ అయిన తరువాత చేపట్టిన అభివృద్ధితో కుప్పం రూపం మారుతోంది. తాగునీటి సమస్య పరిష్కారం, రైల్వే అండ్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం చెప్పిన మాటను నిలబెట్టుకుని ప్రజలకు న్యాయం చేస్తోంది.

– మురళి, పల్లారిగానిమిట్ట, కుప్పం

జగనన్న రుణం తీర్చుకోలేనిది



పంచాయతీగా ఉన్న కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చి, అభివృద్ధి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. గతంలో ప్రజలను పట్టించుకునే నాథుడే లేరు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడింది. గత ప్రభుత్వం కుప్పం పట్టణంలో తాగడానికి నీరు కూడా ఇవ్వలేదు. నేడు నిత్యం తాగనీరు అందుతోంది.

– చలపతి, చీలేపల్లి, కుప్పం

కార్యకర్తలే జగనన్న సైనికులు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: కార్యకర్తలే జగనన్న సైనికులని, రాబోయే ఎన్నికల్లో వారే ముందుండి పార్టీని విజయపథాన నడిపించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సంక్రాంతిపల్లె సమీపంలోని పాపకన్ను మధురెడ్డి గార్డెన్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల శంఖారావాన్ని ఆరంభించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పంచాయతీల్లో నాయకుల మధ్య చిన్నచిన్న మనస్పర్థలు ఉంటాయని, వాటన్నింటినీ పక్కనబెట్టి గ్రామ నాయకులంతా కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఏ ఒక్కరినీ దూరం చేసుకోవద్దని హితవు పలికారు. వెంకటగిరిలో జరిగిన తెలుగుదేశం సభకు నాయకులు తప్ప ప్రజలు రాలేదని ఎద్దేవా చేశారు. అనంతరం వివిధ పంచాయతీల సర్పంచ్‌లతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, నాయకులు చెంచురామిరెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి, శశిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, పిచ్చిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, గని, వెంకటసుబ్బయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వాసుదేవరావు మృతదేహం

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ వద్ద కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం.. బాపట్ల జిల్లా, బాపట్ల మండలంలోని కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన వాసుదేవరావు(48), భార్య బాలభారతి(45), కుమారుడితో కారులో తిరుపతిలోని అరవింద కంటి ఆస్పత్రికి చికిత్స కోసం బయలు దేరారు. ఏర్పేడు మండలంలోని ఐఐటీ వద్ద ముందువెళుతున్న లారీని అధిగమించడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాసుదేవరావు అక్కడికక్కడే మృతిచెందగా.. బాలభారతి, కుమారునికి స్వల్ప గాయాలయ్యాయి. కారుముందు భాగం ధ్వంసమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఆరుగురికి జైలు



పోలీసుల అదుపులో నిందితులు

నాగలాపురం: ఓ మహిళకు సంబంధించిన పొలాన్ని ఆక్రమించిన కేసులో ఆరుగురికి ఏడాదిపాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సత్యవేడు జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పునిచ్చింది స్థానిక ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని కారణి గ్రామానికి చెందిన అనురాధ 2017లో తన పొలంలో బోరు వేయడానికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన రూపేష్ వర్గీయులు దారివదలకుండా తన అనుచరులతో అడ్డుకుని ఆమెపై దాడి చేశారు. ఈ మేరకు ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వివరించారు.

నెరవేరిన దశాబ్దాల కల

- తిరుపతిలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్
- ఫలించిన ఎంపీ గురుమూర్తి కృషి
- నగరంలో పలు భవనాల పరిశీలన



ఎంపీ గురుమూర్తితో సమావేశమై చర్చిస్తున్న కేంద్ర బృందం

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరింది. తిరుపతికి సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌సీ) వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్ ఏర్పాటుకు భవన ఎంపిక కోసం హైదరాబాద్ నుంచి సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మయ్యతో కూడిన త్రిసభ్య కమిటీ బృందం శుక్రవారం తిరుపతిలో పర్యటించింది. అనంతరం ఓ ప్రైవేటు హోటల్‌లో ఎంపీ గురుమూర్తితో సమావేశమైంది.

15 వేల కుటుంబాలకు వైద్యసేవలు

తిరుపతి పరిధిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 15 వేల మంది దాకా ఉన్నారు. వీరికి స్థానికంగా వెల్‌నెస్ సెంటర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీ గురుమూర్తి సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది.

భవనాల పరిశీలన

వెలెనెస్ సెంటర్ ఏర్పాటు నిమిత్తం సంబంధిత అధికారులు శుక్రవారం నగరంలోని పలు భవనాలను పరిశీలించారు. ఇందులో బీఎస్‌ఎన్‌ఎల్ భవనం, స్విమ్స్ పద్మావతి ఆస్పత్రి, రుయా, ఈఎస్‌ఐ ఆస్పత్రులను పరిశీలించారు. ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై త్వరలో ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ హెల్త్ సెంటర్ ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షల కోసం బెంగళూరు, చెన్నై తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. రాయలసీమ పరిధిలోని ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సైతం వైద్యం అందుబాటులోకి రానుంది.

అవసరాన్ని గుర్తించాం..సాధించాం



దశాబ్దాలుగా సీజీహెచ్‌సెంటర్‌కు కేంద్రప్రభుత్వ ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారు. విషయం తన దృష్టికి తెచ్చారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు, మంత్రులతో పలు మార్లు సెంటర్ ఆవశ్యకతను వివరించాను. పార్లమెంట్ వేదికగా విన్నవించాం. కేంద్ర ప్రభుత్వం అవసరాన్ని గుర్తించి సీజీహెచ్ సెంటర్ మంజూరుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినందకు ధన్యవాదాలు. త్రీ సభ్య కమిటీ బృందం భవన సముదాయాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి రెఫర్ చేసిన వెంటనే పూర్తి స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ ఉద్యోగులకు అందుబాటులోకి వస్తుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, సూచనల మేరకు ఈ సెంటర్ సాధించడం సంతోషంగా ఉంది. –మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ఎంపీకి కృతజ్ఞతలు

ఎన్నో ఏళ్లుగా సీజీహెచ్‌ఎస్ సెంటర్‌కోసం ప్రయత్నాలు చేశాం. కేంద్ర మంత్రులకు, అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నాం. కానీ కాలయాపన చేశారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే ఆయన స్పందించారు. 15వేల కుటుంబాలలో వెలుగులు నింపారు. ఎంపీకి కృతజ్ఞతలు.

–కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, తిరుపతి

అమ్మవారి సేవలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి



అమ్మవారి ఆలయంలో సీఎస్ జవహర్‌రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం ఉదయం రాష్ట్ర ముఖ్యకార్యదర్శి (సీఎస్) డాక్టర్ జవహర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన ముందుగా ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మొదలైన కులగణన

- 28 నాటికి పూర్తికానున్న కులగణన సర్వే



రేణిగుంట మండలంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన ప్రక్రియ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ప్రారంభమైంది. జిల్లాలోని 34 మండలాల పరిధిలోని 1,051 రెవెన్యూ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా 691 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటా పూర్తి సమాచారం సేకరించే పనిలో పడ్డారు. కులగణన సర్వేపై కొద్ది రోజులుగా ప్రత్యేక శిక్షణ పొందిన 15 బృందాలకు చెందిన అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఒక్కో బృందం రెండు మండలాల గణనపై దృష్టి పెట్టారు. 10 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని తూకివాకం-2 సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి చెన్నయ్య, సీపీవో మునిచంద్రరెడ్డి, డెప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి పర్యవేక్షించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

గాయపడిన నెమలి

ఐరాల: తవణంపల్లె మండలం ఈచనేరి సమీపంలో రోడ్డుపై ఓ నెమలి గాయపడి ఉండ డా ని కాణిపాకం ఆలయానికి వెళుతున్న భక్తులు గమనించి కాణిపాకం పోలీస్‌స్టేషన్‌కు చేర్చా రు. ఈ విషయాన్ని పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సంత పే ట బీట్ అధికారి రెడ్డెప్ప, అసిస్టెంట్ బీట్ అధి కారి ఉదయకుమార్‌కు ఏఎస్‌ఐ నెమలిని అప్పగించారు. గాయపడిన నెమలికి ప్రథమ చికిత్స నిమిత్తం చిత్తూరు వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం నెమలిని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదులుతామని బీట్ అధికారి రెడ్డెప్ప తెలిపారు.

‘జగనన్న చేదోడు’తో మెరుగైన జీవనం



మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- పీఎం విశ్వకర్మ యోజనతో ఆర్థిక ప్రయోజనాలు
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రశంసా పత్రాలు

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘జగనన్న చేదోడు’తో వేలాది కుటుంబాలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నాయని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం సచివాలయంలో శుక్రవారం పలు పంచాయతీల పరిధిలో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు తుడా చైర్మన్ చేతుల మీదుగా కుట్టు మిషన్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు చేతి వృత్తులలో రాణించాలని ఆకాంక్షించారు. ఏడాదికి రూ.10 వేల చొప్పున నేటి వరకు చేదోడు పథకం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వైఎస్ఆర్సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

శిక్షణ పూర్తి చేసుకున్న 300 మంది మహిళలు

గత మూడు నెలలుగా గాంధీపురం, అవిలాల, లింగేశ్వర నగర్ పంచాయతీలలో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 300 మంది మహిళలు ఉచితంగా టైలరింగ్ శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నైపుణ్య పరీక్ష నిర్వహించారు. అందులో ఉత్తీర్ణులైన మహిళలకు నైపుణ్య అభివృద్ధి కోసం మొదటి దశలో ఐదు రోజుల శిక్షణ నిమిత్తం రూ.2,500, రెండో దశలో 15 రోజుల శిక్షణకు రూ.15,000 విలువైన ఉచిత టైలరింగ్ కిట్‌లను, మూడవ దశలో రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించనున్నారు. మండల పరిధిలోని 19 పంచాయతీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. గాంధీపురం సర్పంచ్ మున్నూరు లక్ష్మి శివ, తుమ్మలగుంట ఎంపీటీసీ యచ్చం సుబ్రమణ్యంరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులపై అసహనం



తిరుపతి మంగళం: పేదల ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యంపై తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారర్తాయన తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, తుడా సెక్రటరీ వెంకటనారాయణ, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రశేఖర్ బాబు, ఏఈ శ్రీరాములురెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్‌తో కలిసి ఏర్పేడు మండలం, చిందేపల్లిలో పేదలు 6,150 మందికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అయితే అక్కడ తుడా తరపున రూ.10 లక్షల నిధులు కేటాయించినా స్థలం చదును చేయకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక రేపు



మాట్లాడుతున్న బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న బైరాగిపట్టెడలోని శ్రీవైఖానస ఆశ్రమ ఆవరణలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఇప్పటికే 500 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. వివాహ పరిచయ వేదికలో భాగంగా 60 ఏళ్లు నిండిన బ్రాహ్మణ దంపతులకు షష్టిపూర్తి, 70 ఏళ్లు నిండిన వారికి భీమరథ శాంతి, 80 ఏళ్లు నిండిన దంపతులకు సహస్ర చంద్ర దర్శన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సంబంధం కుదుర్చుకున్న వారిలో నిరుపేద బ్రాహ్మణుల కుటుంబాలను ఎంపిక చేసి ఉచిత వివాహాలు జరిపిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు రాములవారి ఆలయ ఉత్తర మాడ వీధిలోని బ్రాహ్మణ సమాజం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9949339851, 9030177388లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో బ్రాహ్మణ సమాజం నేతలు రామశర్మ, శ్రీనివాస్, చక్రపాణి పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణకు పటిష్ట చర్యలు

– కలెక్టరేట్‌లో జిల్లా అటవీ, వన్యప్రాణుల రక్షణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: అటవీ..వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కమిటీ చైర్మన్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లా వన్యప్రాణుల రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతాలను సంరక్షించడానికి వన్యప్రాణులకు సరైన రక్షణ కల్పించడానికి అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. వన్యప్రాణులకు ప్రాణహాని తలపెట్టిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పులికాట్ సరస్సుకు వచ్చే పక్షులను సంరక్షించడానికి కృషి చేయాలని చెప్పారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అనంతరం డీఎఫ్‌ఓ సతీష్ రెడ్డి పలు అంశాలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. పాకాల, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, వాటిని ట్రాకర్స్ ద్వారా పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. అలిపిరి కాలినడక మార్గంలో 6 చిరుత పులులను పట్టుకున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అటవీ చట్టం, ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలను పరిశీలించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల్‌కిషోర్, అదనపు ఏఎస్పీ విమలకుమారి, డీఎఫ్‌ఓ వైల్డ్ లైఫ్ సూళ్లూరుపేట శామ్యూల్, ఫ్లయింగ్ స్క్వాడ్ శివకుమార్, సబ్‌డీఎఫ్‌ఓ శ్రీనివాస్, పోలీస్, గిరిజన సంక్షేమ శాఖ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

మెరుగులద్దుతామంటూ టోకరా

పెళ్లకూరు: వెండి, బంగారు నగలకు మెరుగులద్దుతామంటూ ఇద్దరు యువకులు ఆరు సవర్ల బంగారు ఆభరణాలు దోపిడీ చేసిన ఘటన పెళ్లకూరు మండలం, చిల్లకూరులో చోటుచేసుకుంది. బాదితుల కథనం.. చిల్లకూరు గ్రామంలో శుక్రవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు బంగారు, వెండి నగలకు మెరుగులద్దుతామంటూ వచ్చారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ చాగణం శంకరయ్య, దేవసేనమ్మ దంపతులను నమ్మించి బోల్తా కొట్టించారు. దేవసేనమ్మ మెడలో ఉన్న నాలుగన్నర సవర్ల బొందు చైన్, రెండు బంగారు గాజులు, నాలుగు కాసులు మొత్తం ఆరు సవర్లు బంగారు నగలను తీసుకొని ఉడాయించారు. దంపతులిద్దరూ కేకలు వేసినా ఫలితం లేకపోయింది. ఈమేరకు బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఆర్థికంగా ఎదుగుతున్న మహిళా శక్తి



సదస్సుకు హాజరైన అతిథులు, వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు

తిరుపతి సిటీ: గ్రామాలలో మహిళలు పొదుపు సంఘాల రుణ సదుపాయంతో ఆర్థికంగా ఎదుగుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ.రాజశేఖర్ తెలిపారు. శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరుగుతున్న హెల్తీ విలేజ్ జాతీయ వర్క్ షాప్ రెండవ రోజు సెకండ్ సెషన్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. మహిళా పొదుపు సంఘాలు రోజుకు రూపాయి పొదుపుతో ప్రారంభమై నేడు రూ.20 లక్షలకు రుణం పొందే అవకాశం లభించడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి అన్నీతానై సభను విజయవంతం చేసిందని కొనియాడారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ కార్యదర్శి సునీల్‌కుమార్, సెక్రటరీ వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ సీఎస్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధికారి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు

నేడు శ్రీవారి దర్శన భాగ్యం

జాతీయ సదస్సుకు విచ్చేసి ప్రజా ప్రతినిధులు, అధికారులకు శనివారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఈ మేరకు శుక్రవారం తిరుమల వెళ్లారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథిగృహం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 62,649 మంది స్వామివారిని దర్శించుకోగా 24,384 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

స్వయం ప్రతిపత్తితో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న టీటీడీ జేఈవో సదాభార్గవి, డీఈవో భాస్కర్‌రెడ్డి, పాల్గొన్న కళాశాలల ప్రిన్సిపాళ్లు

తిరుపతి(అలిపిరి): టీటీడీ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యాప్రమాణాలు ఉన్నాయని.. తిరుపతిలోని శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్వీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పదేళ్లపాటు అటానమస్(స్వయం ప్రతిపత్తి) హోదా కల్పించిందని జేఈవో సదాభార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి అతిథి భవనంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33 విద్యాసంస్థల్లో మూడు కళాశాలలకు అటానమస్ హోదా లభించినట్లు వెల్లడించారు. దీనివల్ల నాణ్యమైన విద్యాప్రమాణాలు, కళాశాలల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యావిధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులు చేసుకోవడానికి వీలవుతుందని చెప్పారు.

ఇదీ కళాశాలల చరిత్ర

రాయలసీమ జిల్లాలకు చెందిన నిరుపేద పిల్లల విద్యా అవసరాలను తీర్చడానికి తిరుపతిలో వివిధ విద్యాసంస్థలను టీటీడీ ఏర్పాటు చేసింది. ఇందులో 1945లో 80 మంది విద్యార్థులతో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రారంభమైంది. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న 22 కోర్సులలో 2,700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2022 సెప్టెంబర్ 13న కళాశాల న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు పొందింది. 1952లో శ్రీపద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రారంభమైంది. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న 26 కోర్సులలో 2,800 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. 2022 మే 10న కళాశాల న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు పొందింది. 1952లో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రారంభమైంది. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న 19 కోర్సులలో 1,850 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2023 మార్చి 30న కళాశాల న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు పొందింది.

అభినందనలు

టీటీడీకి చెందిన ఎస్‌పీడబ్ల్యూ, ఎస్వీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలకు అటానమస్ హోదా లభించడానికి కృషి చేసిన టీటీడీ జేఈవో సదాభార్గవి, విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి, టీటీడీ విద్యా సంస్థల సలహాదారు మోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ టీ.నారాయణమ్మ, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మహదేవమ్మ, కళాశాల అధ్యాపక బృందాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యకు బాటలు వేశారని కొనియాడారు.